

# సంఘ్ పరివార్ ఫాసిజాన్ని ఎన్నాళ్లు సహిద్దాం?

ఒక దశాబ్దం కింద ఈ పరిస్థితి బహుశా ఎవ్వరూ ఊహించి ఉండరు.

కొంతమంది దుండగులు సినిమా టాకీస్ అద్దాలు పగలగొట్టి ప్రేక్షకులను బెదిరించి 'ఫలానా సినిమా ప్రదర్శన ఆపండి' అంటే ముంబాయి నుండి గౌహతి దాకా ఆ సినిమా ప్రదర్శన ఆగిపోతుందనీ,

ముంబాయిలో కూర్చుని ఒక వ్యక్తి 'పాకిస్తాన్ క్రికెట్ టీం ఈ నగరంలో ఆడడానికి వీలు లేదు' అని ప్రకటిస్తే దేశక్రికెట్ బోర్డే ఎందుకయినా మంచిదని భారత-పాకిస్తాన్ క్రికెట్ మ్యాచ్‌ను ముంబాయిలో ఏర్పాటు చేయకుండ జాగ్రత్త పడుతుందనీ,

అదే వ్యక్తి పాకిస్తానీ కళాకారులెవ్వరూ ముంబాయిలో ప్రదర్శన ఇవ్వడానికి వీలు లేదని శాసిస్తే ప్రదర్శన నిర్వాహకుల నుండి ముంబాయి నగర పాలకుల దాకా అందరూ ఏకగ్రీవంగా ఆ ప్రదర్శన నిర్వహించకుండ ఉండడమే మంచిదని తీర్మానిస్తారనీ,

కొంతమంది దుండగులు ఢిల్లీలో క్రికెట్ పిచ్ తవ్వేసి పాకిస్తాన్ ఇండియాలో క్రికెట్ ఆడడానికి వీలు లేదని ప్రకటిస్తే 'ఎట్టి పరిస్థితిలోనయినా ఆట జరిగి తీరుతుంద'ని ప్రభుత్వం ఒక వైపు ప్రకటిస్తూనే ఎందుకయినా మంచిదని మొదటి టెస్ట్‌ను ఢిల్లీ నుండి చెన్నైకి బదలాయిస్తుందనీ,

ఒక దశాబ్దం కింద ఎవరూ ఊహించి ఉండరు.

కానీ ఈ దశాబ్దకాలంలో కాషాయ టెరరిజం భారతదేశంలో ప్రజాస్వామ్యానికి ఒక పెద్ద ప్రమాదకారిగా మారింది. ఇది కేవలం క్రికెట్‌కూ కళలకూ సినిమాలకూ పరిమితం కాలేదు. హైందవ పురాణాల నుండే తన కుంచెకు ఇతివృత్తాలనూ సింబల్స్‌నూ అత్యధికంగా ఎంచుకున్న ఎం.ఎఫ్ హుస్సేన్‌కు 'నువ్వు ముస్లింవు జాగ్రత్త' అని జ్ఞాపకం చేయడం దగ్గర ఆగిపోలేదు.

యాభై ఏళ్లుగా ఏ రోజూ అభద్రతా భావం లేకుండ బతుకుతున్న క్రైస్తవుల పైన తామే దాడి చేసి భయభ్రాంతుల్ని చేసి, 'వారు చేపడుతున్న మత మార్పిడుల వల్లనే ఈ దాడులు చేయవలసి వచ్చింది' అని సమర్థించుకోవడమే కాక, 'మత మార్పిడులపై జాతీయస్థాయి చర్చ జరగాలి' అని దేశ ప్రధానమంత్రి చేతనే అనిపించగలిగారు. ప్రధానమంత్రే కాదు, 'చర్చ జరిపితే మంచిదేనేమో కదా' అని సమాజంలో చాలామంది అనుకునేటట్టు చేయగలిగారు.

'ఇందుగలడందు లేడని సందేహము వలదు' అన్న సంగతి మరచిపోయి 'రాముడు ఇక్కడే పుట్టాడ'ని పట్టుబట్టి బాబ్రీ మసీదును కూలగొట్టడం దగ్గర ఆగిపోలేదు. దానికి నిరసనగా అల్లర్లకు పాల్పడిన ముంబాయి ముస్లింలకు ఇప్పట్లో మరచిపోలేనంత భయంకరమైన 'గుణపాఠం' నేర్పించారు. 1993 జనవరి నాటి ఊచకోత నుండి ముంబాయి ముస్లింలు కోలుకొని ధైర్యంగా బతకడం కష్టం.

వీళ్లు ఎక్కడో అడవులలో కొండలలో దాక్కొని ఈ పనులు చేయడం లేదు. నాగరికత నడిబొడ్డున ఉంటూ చేస్తున్నారు.

వీళ్లు ప్రశాసనానికి శత్రువులయి సమాజానికి బహిష్కృతులయి ఈ పనులు చేయడం లేదు. తామే ప్రశాసనం నడుపుతూ టెరరిజం చలాయిస్తున్నారు. సమాజం మధ్యనే నిలబడి చలాయిస్తున్నారు. 'ఇది సాగనివ్వం, అది



# మతోన్మాదం

# హక్కులు

# బహిరంగ సభ

1999 జనవరి 30, శనివారం

లయన్స్ క్లబ్ కమ్యూనిటీ హాల్,

రాంగనర్, విశాఖపట్నం

సాయంత్రం 5.00 గంటలకు

అధ్యక్షులు : **ఆర్. వి.రామారావు**
ఆంధ్రభూమి

వక్తలు : **ఎ.సునీత**, కన్వీనర్
మానవహక్కుల వేదిక

**ప్రొ॥ కె.ఎస్. చలం**
సొసైటీ ఫర్ సెక్యులర్ అండ్ డెమొక్రటిక్ కల్చర్ అధ్యక్షులు

**కె. బాలగోపాల్**
మానవహక్కుల వేదిక

సాగనివ్వం' అంటూ ప్రెస్ కాన్ఫరెన్స్‌లు పెట్టి, టి.వి ఛానెల్స్‌కు ఇంటర్వ్యూలు ఇచ్చి చెప్తున్నారు. హింసచేసి, 'ఇది హిందువుల న్యాయమైన ఆగ్రహం' అని బాహాటంగానే ప్రకటిస్తున్నారు. తమ ఆదేశం అమలు కాకపోతే మరింత హింసకు పాల్పడతామని కూడ బాహాటంగానే చెప్తున్నారు.,

అన్నిటికంటే ఆందోళన కలిగించే విషయం సమాజం ఎంత సులభంగా ఈ సంఘ్ పరివార్ గుండాయిజానికి లొంగుతున్నదనేది. వాళ్ల గుండాగిరీని వ్యతిరేకిస్తే మరింత హింసకు పాల్పడతారేమోనని భయపడి బతకడం సమాజం నేర్చుకుంటున్నది. ప్రపంచంలోని అతిపెద్దనగరాలలో ఒకటి, అత్యాధునిక నగరాలలోనూ ఒకటి అయిన ముంబాయి బాల్‌థాకరే గుండాగిరీకి లొంగి బతుకుతూ ఉంది. వ్యతిరేకించే వాళ్లు ముంబాయిలో లేనేలేరని కాదు. ఆ నగరాన్ని అంతగా అవమానపరచనవసరం లేదు. కానీ నిస్సహాయంగా గొణుక్కుంటూ శివసేనకు లోబడి బతకడం ఆ నగరం నేర్చుకుంది. 'దావూద్ ఇబ్రహీం గురించి, అరుణ్ గావ్లీ గురించి ఎందుకు మాట్లాడుకోవాలి? శివసేనను మించిన మాఫియా ముంబాయిలో ఏది ఉంది?' అని ఆ నగర వాసులందరూ అంటారు. అంటూ వారితో అడ్జస్ట్ అయి బతుకుతుంటారు. ప్రజలే కాదు, ప్రశాసనం కూడా అడ్జస్ట్ అయి బతకడం నేర్చుకుంటూ ఉంది. 1993 జనవరి హింసాకాండ సందర్భంగా బాల్‌థాకరే మీద, అతని అనుయాయుల మీద చట్టం ప్రకారం చర్య ఎందుకు తీసుకోలేదని అప్పటి మహారాష్ట్ర ముఖ్యమంత్రిని జస్టిస్ శ్రీకృష్ణ కమీషన్ ప్రశ్నించగా, 'వాళ్లమీద చర్య తీసుకుంటే ముంబాయి తగలబడుతుందని భయపడ్డాం' అని ఆ కాంగ్రెస్ ముఖ్యమంత్రి జవాబు ఇచ్చాడు!.

సంఘ్ పరివార్ గుండాయిజాన్ని గుండాయిజం అంటూ ఈ రోజు విశాఖపట్నంలో సభ జరుపుతున్నాం. కాని ఇలాంటి సభను దేశరాజధాని ఢిల్లీలో జరపడం చాలా కష్టం - సొంతగా మందీ మార్బలం ఉన్న వాళ్లకయితే తప్ప. ఢిల్లీ విశ్వవిద్యాలయం నుండి జవహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయం దాకా అన్ని చోట్లా వాళ్లను విమర్శిస్తూ జరిపిన మీటింగ్‌లపై దాడి చేసి విధ్వంసం సృష్టించిన చరిత్ర వారికి ఉంది.

యూరప్‌లో 1930లో ఫాసిజం ఒక ప్రబలమైన దుష్టశక్తిగా ఎదగడాన్ని పరిశీలించిన వాళ్లందరూ ఒక విషయం గుర్తించారు. బలప్రయోగంతోనూ బెదిరింపుతోనూ సమాజాన్ని శాసిస్తామంటూ ఫాసిస్టులు ముందుకొచ్చినప్పుడు తక్కిన సమాజం ప్రతిఘటించకుండ లొంగిపోవడం ఫాసిస్టుల ప్రణాళికను సులభతరం చేసింది. లొంగే కొద్దీ వాళ్లు విజృంభించారు. వాళ్లు విజృంభించే కొద్దీ సమాజం మరింత లొంగింది. బలప్రయోగం ముందు వివేచననూ ఆత్మవిశ్వాసాన్నీ కోల్పోయి మౌనంగా ఉండిపోయే ఈ వైఖరి హిట్లర్ వంటి ఒక పిరికి మనిషిని మహానియంతను చేయగలిగింది.

ఇది. కేవలం మైనారిటీల సమస్య అనుకుంటే పొరబాటే. మైనారిటీల సమస్యే అయినా అందరం పట్టించుకోవలసిందే. కానీ సంఘ్‌పరివార్ ఫాసిజం కేవలం ముస్లింలకూ క్రైస్తవులకే ప్రమాదకారి కాదు. ఈ విషయం పదేపదే చెప్పుకోవలసి ఉంది.

స్త్రీలు ఏం చేయవచ్చో ఏం చేయకూడదో చెప్తామని వాళ్లు 'ఫైర్' సినిమా పైన అప్రకటిత నిషేధం పెట్టారు.

దళితులు ఆత్మగౌరవం కోసం హైందవ సమాజాన్ని వదిలిపెట్టి పోవచ్చునో లేదో మేము చెప్తామని వాళ్లు డాంగ్స్ నుండి జలంధర్‌దాకా అనేక చోట్ల హింసాత్మకంగా ప్రకటించారు.

వాళ్లు సంస్కృతికి నిర్వచనం చెప్తారు, స్వేచ్ఛకు పరిమితులు పెడతారు, మంచి ఏమిటో చెడు ఏమిటో ప్రకటించి కర్రలతో రాళ్లతో బాంబులతో అమలు చేస్తారు.

కానీ వాళ్లకు తెలిసిన మంచిలో సమతకూ ప్రజాస్వామ్యానికీ చోటులేదు. అది నిచ్చెనమెట్ల బ్రాహ్మణ ధర్మం నేర్పించిన మంచి. దానిని కర్రలతో రాళ్లతో అమలు చేయడానికి పూనుకున్న ఈ కాషాయ ఫాసిజాన్ని ఎన్నాళ్లు సహిద్దాం?

25-1-99

మానవహక్కుల వేదిక

# హిందూ

# మానవ

# శివమెత్తిన సేన

## శ్రీకృష్ణ కమీషన్ నివేదిక



**మానవహక్కుల వేదిక ప్రచురణ**

1992-93 ముంబాయి అల్లర్లపైన
శ్రీకృష్ణ కమీషన్ ప్రకటించిన నివేదికపై
మానవహక్కుల వేదిక ప్రచురించిన సంక్షిప్త
పరిచయ పుస్తకాన్ని ఆవిష్కరిస్తాం.